క్లుప్తంగా

రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న రుద్రగౌడ్

ఎమ్మిగనూరు టౌన్: రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా కేక్ కట్ చేసిన అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు

ఎమ్మిగనూరు: రక్తదానం వల్ల ఆపదలో ఉన్న వారిని ఆదుకున్న ప్రాణదాతలవుతారని డాక్టర్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో కర్నూలు విశ్వభారతి వైద్యశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి వెంకటేష్

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి వెంకటేష్ జాతీయ స్థాయి పరుగు పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రాముడు మంగళవారం తెలిపారు. సెప్టెంబర్ 25వ తేదీన గుంటూరులో జరిగిన 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెంకటేష్ హాజరవుతున్నట్లు చెప్పారు. అలాగే 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ తెలిపారు. సెపక్ తక్రాలో రాజేశ్వరి, రాధిక, కబడ్డీలో వైష్ణవి, పరుగు పోటీల్లో వెంకటేష్, శైలజ, లక్ష్మి, ఉష తదితరులు ఎంపికయ్యారన్నారు. వీరందరూ గుంటూరు జిల్లా బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

కొనసాగుతున్న శౌర్య జాగరణ యాత్ర



వెల్దుర్తి మీదుగా సాగుతున్న యాత్ర

వెల్దుర్తి: విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో చేపట్టిన శౌర్య జాగరణ యాత్రలో భాగంగా మంగళవారం వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లోని పలు ఆలయాలలో పూజలు నిర్వహిస్తూ, హిందూ ధర్మ ప్రచారం చేస్తూ కొనసాగింది. ఈనెల 8న వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో, తదనంతరం మంగళవారం కలుగొట్ల, కృష్ణాపురం, పుల్లగుమ్మి, రామళ్లకోట, వెల్దుర్తి, చెరుకులపాడు మీదుగా కృష్ణగిరి మండల కేంద్రం చేరుకుని, ఎరుకుల చెరువు, ఆగవేలి మీదుగా సాగింది. యాత్రలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంఘాల నాయకులు శాంతి, హరిసింహానాయుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ప్రశాంతంగా జరుపుకోండి



ఎల్లార్తిలో పర్యటిస్తున్న డీఎస్పీ, ఆలూరు సీఐ, ఎస్‌ఐ

హొళగుంద: రేపటి నుంచి జరిగే ఎల్లార్తి షేక్షావలి, షాషావలి ఉరుసు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్‌ఐ శ్రీనివాసులతో కలిసి ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను దర్శించుకున్నారు. అనంతరం దర్గా పరిసరాలు, గ్రామంలో పర్యటించారు. ఉరుసులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని సీఐ, ఎస్‌ఐను ఆదేశించారు. భక్తులు ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు.

రీసర్వే పక్కాగా చేపట్టండి



రీసర్వే రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్న డీటీ బ్రహ్మయ్య

హాలహర్వి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వేను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ మల్లికార్జున సిబ్బందిని ఆదేశించారు. మండలంలో ఇప్పటివరకు జరిగిన రీసర్వే రికార్డులు, వాటి ఆన్‌లైన్ చేసే విధానాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇచ్చిన లక్ష్యాన్ని రెవెన్యూ సిబ్బంది పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వే డీటీ బ్రహ్మయ్య, వీఆర్వోలు ఆంజనేయులు, లోకవీర, రాఘవేంద్రస్వామి, తిమ్మన్న, సర్వేయర్లు వెంకటేష్, అరుణ్‌జ్యోతి, రాజమ్మ పాల్గొన్నారు.









పెండేకల్లులో కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలిక్ అసిస్టెంట్, ఏరూరులో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం, ముత్తుకూరులో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్, బి.అగ్రహారంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది,



లింగంపల్లిలో వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



శిలారుదొడ్డిలో సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్



శ్రీరంగాపురం హెల్త్ కాంప్‌నకు తరలివచ్చిన ప్రజలు



మొలగవల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఎమ్మిగనూరు: విద్యా, వైద్యం కార్పొరేట్ కరెన్సీ దాటి పేదల గడపలకు విస్తరించాయంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చలువేనని, పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరంలాంటిదని నాయకులు పేర్కొన్నారు. ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడిమెట్ల పంచాయతీ మజరా గ్రామం శిలారుదొడ్డిలో మంగళవారం ప్రభుత్వ వైద్యులు అపర్ణ, మహేశ్వరప్రసాద్, శరణ్యశ్రీ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 357 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 23 మంది గర్భిణులు, 12 మంది బాలింతలకు చికిత్సలు అందించారు. నలుగురిని మేజర్ శస్త్ర చికిత్సల కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. సర్పంచ్ పెద్ద మరెప్ప, డీటీ గురురాజరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో శ్రీరంగాపురం, లక్ష్మంపల్లె, బోగోలు, చిన్న కొలుములపల్లె గ్రామాలకు చెందిన 465 మంది ఆరోగ్య సేవలందుకున్నారు. వైద్యాధికారులు, స్పెషలిస్టు వైద్యులు నవీన్‌కుమార్, ప్రతిభ, భరత్, కిరణ్‌కుమార్, కవితలు ఓపీ చూస్తూ చికిత్స అందించారు. ఉచితంగా మందుల పంపిణీ చేశారు. అధికారులు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలకృష్ణ పలువురికి కంటి అద్దాలు, హెల్త్ కార్డులు అందించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, శిబిరాన్ని పర్యవేక్షించారు.

తుగ్గలి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని తహసీల్దార్ రవి, సర్పంచ్ హారిక అన్నారు. మంగళవారం పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. వివిధ కౌంటర్ల వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, బసిరెడ్డి, సూర్య నారాయణరెడ్డి, నాగరాజు, చాణక్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. వివిధ ఆరోగ్య సమస్యలున్న వారు శిబిరానికి తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్పెషలిస్ట్ డాక్టర్ వైద్య చికిత్సలందించి మందులు పంపిణీ చేశారు. ఒక్క రోజులోనే 525 మందికి వైద్య సేవలందించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎంపీడీఓ కొండయ్య, మెడికల్ ఆఫీసర్ జమీల్ అహమ్మద్, సర్పంచి తిమ్మాపురం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. ఆయన మంగళవారం బి.అగ్రహారం గ్రామ ప్రత్యేక వైద్య శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి పరిశీలించారు. వైద్యులు రంగ రవళి, రుక్సానా, అపర్ణ, సింధూరలు 350 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈఓఆర్డీ నాగేష్, సర్పంచ్ రంగారెడ్డి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 400 మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. డాక్టర్ దుర్గాబాయి, గీతావాణి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ రాణెమ్మ, డీటీ గాయిత్రీ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. సర్పంచ్ తోయజాక్షప్ప ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెర: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం, ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హంప గ్రామంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని బొమ్మనపల్లి, కొత్తపల్లి, ఎడవలి గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకుని మందులు పొందారు. సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సిరుగాపురంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హొళగుంద: లింగంపల్లి గ్రామంలో సర్పంచ్ పద్మావతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు న్యూటన్, రాధ, డాక్టర్లు వివేక్, మనోజ్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొని వైద్య సేవలందించారు. శిబిరంలో 400 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా ముందులు అందించారు. మెరుగైన చికిత్స అవసరమైన వారికి ఆస్పత్రికి రెఫర్ చేసారు. ఎంపీడీఓ సుహాసినమ్మ, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి-1 సచివాలయం పరిధిలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఇబ్రహీం, మానస, గుల్జాన్ బేగం ఆధ్వర్యంలో 385 మందికి వైద్య సేవలందించారు. శిబిరానికి రోగులు భారీ ఎత్తున తరలివచ్చి చికిత్స చేయించుకున్నారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చిన్న ఈరన్న, సర్పంచ్ మోహన్ రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని నాగలదిన్నె గ్రామ సచివాలయంలో వైద్యాధికారులు సౌజన్యలత, విజయభారతి, వైద్యులు శృతి, శ్రీచరణ్ ప్రజలకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో 507 మందికి వైద్య పరీక్షలు చేశారు. 24 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ దశరథ రామయ్య శిబిరం ఏర్పాట్లు, చికిత్స విధానాన్ని పర్యవేక్షించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



నాగలదిన్నెలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం



పత్తికొండ వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాసు



నెల్లిబండ గ్రామంలో వైద్య సేవలందిస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని చింతకుంట సచివాలయం-2 పరిధిలోని సిరుగాపురం గ్రామంలో ఎంపీడీఓ ఆంతోనీ, తహసీల్దార్ మల్లికార్జున ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మన్సూర్‌వలీ, గంగాధర్, ఈరన్న, తిమ్మన్న రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. వాటి ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు.

పత్తికొండటౌన్: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎంపీపీ ఎం.నారాయణదాసు అన్నారు. మంగళవారం పత్తికొండ పట్టణంలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో ఏర్పాటుచేసిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలందించారు. సర్పంచ్ కొమ్ముదీపిక, వైద్యాధికారిణి శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని నెల్లిబండ గ్రామంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు ప్రజలకు వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నా



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా చేయించుకున్నాను. వైద్యులు బాగా పరీక్షించి నెలకు సరిపడే మందులను ఉచితంగా అందించారు. బీపీ, షుగర్‌కు ప్రతినెలా బళ్లారి ఆస్పత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకునేదాన్ని. ఈ వైద్య శిబిరంతో ఖర్చులు మిగిలాయి. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం బాగుంది.

– సి.లక్ష్మిదేవి, చింతకుంట

మా ఊరి నుంచి తీసుకొచ్చి వైద్యం చేయించారు



మా ఊరి నుంచి గ్రామ సచివాలయానికి దాదాపు 10 కి.మీ ఉంటుంది. అధికారులు ఆటోలో వైద్య శిబిరానికి తీసుకొచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించి మందులు ఇచ్చారు. నాకు కాళ్ల నొప్పులతో బయటికి రావాలంటే ఇబ్బందిగా ఉండేది. నడవలేక ఇబ్బందులు పడేదాన్ని. సారోళ్లు ఆటోలు పంపి మా ఆరోగ్యం గురించి పట్టించుకున్నారు. ఇలా సేవలందిస్తారని ఊహించలేదు.

– కొల్లమ్మ, కొత్తపల్లి, మద్దికెర మండలం

ఆరోగ్య పరీక్షలు చేయడం సంతోషం



నా పేరు ఏసయ్య. మాది హంప గ్రామం. వైద్యం కోసం మండల కేంద్రానికి పోవాలంటే 10 కి.మీ దూరం ఉంది. అయితే ప్రభుత్వం గ్రామంలోనే నిపుణులైన వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇవ్వడం చాలా సంతోషించదగ్గ విషయం.

– ఏసయ్య, హంప, మద్దికెర మండలం

నేడు ఆలయానికి చేరనున్న పల్లకోత్సవం

ఆలూరు: కర్ణాటక రాష్ట్రంలోని హంపి మహా పుణ్యక్షేత్రంలో కొలువుదీరిన విరుపాక్షయ్య స్వామి దర్శనం కోసం గత నెల 29వ తేదీన పెద్ద హోతూరు, మరకట్టు గ్రామాల నుంచి పాదయాత్రగా తరలివెళ్లిన ఉచ్చీరప్ప తాత, సలువప్ప తాత ఉత్సవమూర్తుల పల్లకోత్సవం బుధవారం తిరిగి ఆలయానికి చేరుకోనుంది. అక్కడి స్వామివారి దర్శనం అనంతరం తిరుగుపయనం కాగా పెద్దహోతూరులోని ఉచ్చీరప్ప తాత ఆలయానికి, మరకట్టు గ్రామంలో కొలువుదీరిన సలువప్ప తాత ఆలయానికి ఉత్సవమూర్తులు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా బెంగళూరు, మైసూరు, హైదారాబాద్ నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన పూలమాలలతో ఉత్సవమూర్తులను అలకరించి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం మహా మంగళహారతి కార్యక్రమం, ముగింపు పూజ తర్వాత మరకట్టు గ్రామానికి ఆలయ అర్చకుడు ఉచ్చీరప్ప స్వామి ఆధ్వర్యంలో చేరుకుంటారు. భక్తులు భారీ ఎత్తున పాల్గొననున్న నేపథ్యంలో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సీఐ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఏఈఆర్వో రామాంజినేయులు

ఆలూరు రూరల్: ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టాలని ఆలూరు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రామాంజినేయులు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. అప్పటివరకు కొత్త ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అలాగే జాబితాలో మార్పులు చేర్పుల కోసం దరఖాస్తులను స్వీకరించాలని చెప్పారు. ముసాయిదా జాబితా ప్రదర్శన అనంతరం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నమోదు చేయడం, మార్పులు చేయడం ప్రక్రియ చేపడతామన్నారు. 27వ తేదీ తర్వాత నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. బీఎల్ఓలు బాధ్యతగా పనిచేసేలా సూపర్‌వైజర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల డీటీ గుండాల్ నాయక్, సీనియర్ అసిస్టెంట్ బసవన్న గౌడ్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

జీవాల పెంపకంలో రాణించాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఆస్పరి: లాభదాయకమైన గొర్రెల పెంపకం చేపట్టాలని ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆస్పరి పశు వైద్యశాల సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గొర్రెల మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేళ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. గొర్రెలకు పాకలు ఏర్పాటు చేసుకోవాలని, శ్రేష్టమైన మేపు, పశు గ్రాసం అందించాలని సూచించారు. వ్యాధి బారిన పడిన గొర్రెలను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించడం ద్వారా మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. గొర్రెలలో పారుడు, గాలికుంటు వ్యాధి, చిటుక రోగము, బొబ్బ వ్యాధి, నీలి నాలుక, అంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, నట్టల నివారణ, పిరుదులు, మిన్నల్లుల నివారణ వంటి వైరస్ వల్ల సంక్రమించే వ్యాధుల నివారణ, అందించాల్సిన చికిత్స, జాగ్రత్తలను వివరించారు. పశు వైద్యాధికారులు శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్, ఫణీంద్రకుమార్, జానకి, పాడి రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వెల్దుర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న నంద్యాల జిల్లా కేంద్రంలో అండర్-17 కబడ్డీ మహిళా విభాగంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెల్దుర్తి మండలం కలుగొట్ల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని టి.గీత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎన్నికైనట్లు హెచ్‌ఎం శివజ్యోతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ బి.కృష్ణుడు, హెచ్‌ఎం తదితరులు క్రీడాకారిణి, పీఈటీ శేషాద్రిని అభినందించారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామానికి చెందిన, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎం.వీరేష్, సి.గోపీనాథ్, అండర్-14 విభాగం త్రోబాల్ పోటీల్లో పి.ఐశ్వర్య ఎంపికయ్యారు. భారతీయ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నంద్యాలలో ఈ నెల 7, 9వ తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం అబ్దుల్ రహిమాన్ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

ఆస్పరి: మండలంలోని అట్టికల్లు గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు పరుశన్నకు చెందిన గడివామి దగ్ధమైంది. దీంతో రైతుకు రూ.30 వేలు నష్టం జరిగింది. ఊరి చివరన గడ్డివామిలో మంటలు చెలరేగడంతో గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ లోపే గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న పత్తికొండ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలు అదుపు చేశారు.

పందికోనలో పశు వైద్య శిబిరం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. సహాయ సంచాలకులు రవిప్రకాశ్, పశువైద్యాధికారి లక్ష్మణ్ పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాడి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. పశువైద్య సిబ్బంది కిషోర్, విజయ్, రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ ప్రకాశ్, జిల్లా ప్రతినిధి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

హొళగుంద: కోగిలతోట గ్రామానికి చెందిన బోయ పార్వతి (29) అనే వివాహిత కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం విలేకరులకు తెలిపారు. సదరు మహిళ ఏడాది క్రితం కవల పిల్లలకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ నెల 9న నొప్పి తీవ్రం కావడంతో బాధను తట్టుకోలేక రాత్రి ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం బళ్లారి పెద్దాసుపత్రి (ఓపీడీ)కి తరలించగా కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ వెల్లడించారు. మృతురాలి తల్లి గాదిలింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రస్తా ఆక్రమణల పరిశీలన

హొళగుంద: కొత్తపేట గ్రామానికి వాహనాలు రాకపోకలు సాగించేందుకు అడ్డంకిగా ఉన్న నెరణికి తండా గ్రామంలోని రస్తాను మంగళవారం తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఎంపీడీఓ సుహాసినమ్మ, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ పరిశీలించారు. నెరణికి తండా మీదుగా కొత్తపేట గ్రామానికి వెళ్లే రోడ్డులో మరుగుదొడ్లు, విద్యుత్ స్తంభాలు, అరుగులు, ఇతర కట్టడాలు అడ్డంగా ఉండడంతో వాహనాలు తిరిగేందుకు ఇబ్బందిగా ఉందని, సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం గ్రామానికి వెళ్లిన అధికారులు రస్తా సమస్యపై గ్రామస్తులను విచారించారు. రస్తాను సర్వే చేయించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

అందరికీ ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న యశోధరావు

ఎమ్మిగనూరు: వలసలు నివారించి గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ పథకం రీసోర్స్ పర్సన్ యశోధరావు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జీవనోపాధుల కేంద్రంలో ఉపాధి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం చేపట్టారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు తయారుచేయడం, ప్రతి కుటుంబానికి జాబ్ కార్డులు అందించడం, వంద రోజుల పనిదినాలు కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయడంపై శిక్షణా తరగతుల్లో వివరించారు. ఉపాధి పనిదినాలతో వలసలు నివారించడం, నీటి సంరక్షణ, భూసార సంరక్షణ, మొక్కల పెంపకం కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్లస్టర్ ఏపీఓలు లోకేశ్వర, అలిపీరన్, కృష్ణమోహన్, మహేంద్రతోపాటు ఎమ్మిగనూరు, ఆదోని క్లస్టర్ల పరిధిలోని ఈసీలు, టీఏలు, సీఓలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో ప్రజల చెంతకు పాలన



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

నందవరం: ప్రజల చెంతకు పాలన తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కనకవీడుపేట, నందవరం సచివాలయం-2లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పేదల సంక్షేమం చేస్తున్న కృషిని, పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం వ్యవస్థతో ప్రభుత్వ పాలన పల్లెకు చేరిందన్నారు. ప్రజలకు ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు పొందే అవకాశం కలిగిందని వివరించారు. అలాగే విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని పాట్లు పడినా అధికారంలోకి రావడం పగటికలేనని, అవినీతిలో కూరుకుపోయిన చంద్రబాబుకు ఇప్పట్లో ఉపశమనం దొరకడం కష్టమని అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, నాయకులు పేట శ్రీనివాసరెడ్డి, సర్పంచులు ముగతి విరుపాక్షిరెడ్డి, తోట సావిత్రి, సరస్వతి, ఎంపీడీఓ దశరథ రామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగులో రాణించాలి



మొక్కలను పంపిణీ చేస్తున్న సే ట్రీస్ సంస్థ సభ్యులు

దేవనకొండ: కర్నూలు జిల్లా మాజీ ఎస్పీ ఆకె రవికృష్ణ దత్తత గ్రామమైన కప్పట్రాళ్లలో కళ్యాణ మండపంలో 'సే ట్రీస్ సంస్థ' ఆధ్వర్యంలో కార్పొరేట్ హెడ్ శరణ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున చేతులమీదుగా మొక్కల పంపిణీ చేపట్టారు. వారు మంగళవారం మామిడి, బత్తాయి, జామ, ఉసిరి, అవకాడ్, దానిమ్మ, అంజూర, సీతాఫలం, టెంకాయ, టేకు, మహాగ్రణి, ఎర్రచందనం తదితర మొక్కలను 64 మంది రైతులకు అందించారు. మొత్తం 25 వేల మొక్కలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రైతులు బహుళ అంతస్తుల విధానంలో పండ్ల తోటలు సాగుచేసి అధిక లాభాలు పొందాలన్నారు. గతేడాది నాటిన పండ్ల తోటలను వారు సందర్శించారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ యూనిట్‌ను పరిశీలించారు. ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ, రిసోర్స్ పర్సన్ చింతమాను రవికుమార్, ఫీల్డ్ రిసోర్స్ పర్సన్ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

ఆలూరు: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలని ఆలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్ సూచించారు. ఆలూరులోని మెయిన్ పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన మౌళిక సదుపాయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నాడు-నేడు ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో వసతులు కల్పించారన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. సీబీఎస్ఈ సిలబస్‌కు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. వైస్ ఎంపీపీ నాగవేణి, కోఆప్షన్ మెంబర్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్ తదితరులు ఉన్నారు.